సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 14 । జూలై । 2024



మునగ.. ఆదాయం దండిగ
మునగ సాగు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో 100 శాతం సబ్సిడీ కల్పిస్తోంది. అర్హులైన రైతుల గుర్తింపులో సిబ్బంది నిమగ్నమయ్యారు. -8లో



ముగిసిన కబడ్డీ టోర్నమెంట్
కడప నగరం వేదికగా గత మూడు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఈ) కబడ్డీ టోర్నమెంట్ శనివారం ముగిసింది. -8లో

గరిష్టం/కనిష్టం
36.8/26.2

వాతావరణం
జిల్లాలో శనివారం 26.2 - 36.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైఎస్ఆర్ జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు నియామకం



కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా నూతన ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు నియమితులయ్యారు. ప్రస్తుత ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 12న జిల్లా ఎస్పీగా బాధ్యతలను చేపట్టిన సిద్దార్థ్ కౌశల్ కేవలం 10 నెలల్లోనే మళ్లీ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఇక కొత్త ఎస్పీగా 2013 బ్యాచ్‌కు చెందిన హర్షవర్ధన్ రాజును నియమించారు. ఈయన ప్రస్తుతం తిరుపతి జిల్లా ఎస్పీగా పని చేస్తున్నారు. అంతకుముందు అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేశారు.

ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రస్థానం ...
నెల్లూరు జిల్లా కావలిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఇంటర్ వరకు విద్యాభ్యాసం కొనసాగించారు. తర్వాత ఇంజనీరింగ్ అనంతపురం జేఎన్‌టీయులో పూర్తి చేశారు. ఆయన తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులే. ఆయన తొలిసారిగా అవనిగడ్డలో ఎస్‌డీపీఓగా పనిచేశారు. ఆపై అనంతపురంలో పనిచేశారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు.

అన్నమయ్య జిల్లా ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు



రాయచోటి: అన్నమయ్య జిల్లా ఎస్పీగా విద్యాసాగర్ నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ప్రభుత్వం భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ బదిలీలలో భాగంగా అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న బి కృష్ణారావును కోనసీమ అంబేడ్కర్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏడాది క్రిందట జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారావు సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారన్న పేరుంది. 2016 బ్యాచ్‌కు చెందిన విద్యా సాగర్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

రాయచోటి టౌన్: చిత్తూరు జిల్లా పుత్తూరులో ఆగస్టు నెల 10,11,12 తేదీల్లో జరిగే అంతర్ జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలకు జట్టు ఎంపికలు నిర్వహించారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి మాసాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపికలకు ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 40 మందిని ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. కోచ్‌లు జగదీశ్వరయ్య, రవి రాజు ఆధ్వర్యంలో బాలురు, శ్రీకాంత్ రెడ్డి జేసునాథరెడ్డి ఆధ్వర్యంలో బాలికలను ఎంపిక చేశారు.వర్కింగ్ ప్రెసిడెంట్ రామ సుబ్బారెడ్డి, ప్రసాద్, పీడీలు పాల్గొన్నారు.

అమ్మో.. భూచోళ్లు

- ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పేట్రేగిపోతున్న శ్రేణులు
- ఎక్కడపడితే అక్కడ భూములపై పంజా
- పుల్లంపేట మండలంలో భూములకు కంచె వేస్తున్న వైనం
- మంగంపేట మైనింగ్ ఆదాయంపై కన్ను
- ఆధిపత్యం కోసం రెచ్చిపోతున్న తమ్ముళ్లు
- రైల్వేకోడూరు సెగ్మెంట్‌లో పలుచోట్ల దాడులు



పుల్లంపేట మండలంలో అక్రమార్కులు స్వాధీనం చేసుకున్న భూములు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకం రాజ్యమేలుతోంది. తాము చెప్పిందే వేదం...తాము చేసేదే శాసనం అన్న తరహాలో పేట్రేగి పోతున్నారు. ఇదేమిటి అని అడగాల్సిన పోలీసులు నిమ్మకుండి పోతున్నారు.ఎవరేమనుకున్నా సరే తెలుగు తమ్ముళ్లు వారు అనుకున్న దాడుల పథకం అమలు చేస్తున్నారు. చరిత్రలో ఎన్నికలను పరిశీలిస్తే గెలుపోటములు సహజం. ఒకసారి ఒక పార్టీ అధికారంలోకి వస్తే, మరోసారి ఇంకోపార్టీ అధికారంలోకి రావడం సాధారణం. అయితే అధికారంలోకి వచ్చిన పార్టీ నాయకులు ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చేయాల్సిందిపోగా...అటవిక రాజ్యం కనిపించేలా భయానక పరిస్థితులు సృష్టిస్తున్నారు. నయానో, భయానో ఏదో ఒక రకంగా దారికి తెచ్చుకుంటే అడ్డు ఉండదన్న నెపంతో తెలుగు తమ్ముళ్లు అరాచకం సృష్టిస్తున్నారు. వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలోనూ అరాచకానికి తెర లేపుతున్నారు. అధికార గర్వంతో వైఎస్సార్ సీపీ శ్రేణులను అణగదొక్కడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లడం ఆందోళన కలిగించే పరిణామం.

▶▶ భూములపై పంజా

రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట మండలంలో ఉన్న ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నేతలు కన్ను వేశారు. ఎక్కడికక్కడ మండలంలోని మూడు, నాలుగు గ్రామాల్లో భూములను చదును చేసి కంచె వేశారు. అవకాశం ఉన్న మేర ప్రభుత్వ భూములను గుర్తించి చుట్టూ ఉన్న కంపచెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి వ్యవసాయానికి అనుబంధంగా ఉన్నట్లు తయారు చేస్తున్నారు. ప్రధానంగా బావికాడపల్లె, తిప్పాయపల్లె, అనంతసముద్రం, కొమ్మనవారిపల్లె, ఇతర పలు గ్రామాల్లో భూములను ఆక్రమించి సిద్ధం చేసుకుంటున్నారు. అధికారపార్టీలోనే భూముల ఆక్రమణల వ్యవహారంపై విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఒకరంటే ఒకరికి గిట్టక అధిష్టానానికి కూడా ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఒక్క పుల్లంపేట మండలంలోని 50-100 ఎకరాల మధ్య రికార్డుల్లోని ప్రభుత్వ భూములపై పచ్చ నేతలు పంజా విసిరారు. ఎక్కడ పడితే అక్కడ ఆక్రమ వ్యవహారాలకు తెర తీస్తుండడంపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

▶▶ తెగబడుతున్న తమ్ముళ్లు



జిల్లాలో తెలుగు తమ్ముళ్లు తెగబడుతున్నారు. ప్రధానంగా రైల్వేకోడూరులో సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీపై జనసేన విజయం సాధించిన తర్వాత నుంచి జనసేన శ్రేణులతోపాటు తెలుగు తమ్ముళ్లు పలుచోట్ల దాడులకు ఉపక్రమించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం నుంచి వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులకు చెందిన ఆస్తులను ధ్వంసం చేసే కార్యక్రమానికి పూనుకున్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలను ప్రజాస్వామ్య వాదులు ఖండిస్తున్నా లెక్కచేయకుండా వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతుండటాన్ని పలువురు తప్పుపడుతున్నారు. మంగంపేట పరిధిలోని ఎస్టీ కాలనీలో ఏపీఎండీసీ పునరావాసం కోసం ఎదురుచూస్తున్న వైఎస్సార్ సీపీకి చెందిన వారి ఆస్తులను టీడీపీ వారు ధ్వంసం చేశారు. అదే పునరావాస కాలనీలో వైఎస్సార్ సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ అనంతరం చెప్పులు, రాళ్లు వైఎస్సార్ సీపీ శ్రేణులపై పచ్చ నేతలు విసిరారు. ఇక్కడ ఒకచోటే కాదు...పెనగలూరు మండలంలో కూడా ఒకటి, రెండు చోట్ల కూటమి శ్రేణులు దాడికి ఉపక్రమించారు. తర్వాత ఎదురు తిరగడంతో అక్కడి నుంచి నిష్క్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. పుల్లంపేట మండలంలో కూడా గతంలో జరిగిన సంఘటనలను గుర్తు పెట్టుకుని అధికారంలోకి రాగానే మూకుమ్మడిగా దాడికి పూనుకున్నారు. రైల్వేకోడూరు టోల్‌గేటు వద్ద ఎంపీపీ సొంత నిధులతో నిర్మించిన బస్టాప్‌పై ఉన్న పార్టీ అగ్ర నాయకుల ఫొటోలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా రైల్వేకోడూరు ప్రధాన ఆస్పత్రి వద్ద, చిట్వేలికి వెళ్లే దారిలోని బ్రిడ్జి వద్ద ఉన్న శిలాఫలకాలను జనసేన శ్రేణులు పగులగొట్టి విధ్వంసం సృష్టించాయి.



రైల్వేకోడూరులో జనసేన శ్రేణులు ధ్వంసం చేసిన శిలాఫలకాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు(ఫైల్)

'జీపీఎస్'పై ఉపాధ్యాయుల భగ్గు

- జీపీఎస్ అమలు రాజపత్రాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆందోళన
- రాజపత్రాల దహనం



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు పరుస్తూ ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం కడప కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ నాయకులు ఆందోళన చేసి జీపీఎస్ అమలు పరుస్తూ ఇచ్చిన రాజపత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ చేసిన పోరాటాల ఫలితంగా ఎన్నికల ముందు గత ప్రభుత్వం జీపీఎస్ అమలు చేయలేదని అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు భరోసా లేని పెన్షన్ విధానాన్ని బలవంతంగా రుద్దడానికి పూనుకోవడం మంచిది కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు తీరని నష్టాన్ని కలిగించే జీపీఎస్ అమలు చేయడం లాంటి నిర్ణయాలు తీసుకోవడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తల చంద్రశేఖర్, ఏడి దేవదత్తం, మాలే బాబు, చెన్నయ్య, శశంకర్‌రెడ్డి, అబ్దుల్‌గని, ఎంపీఎస్ రాజు పాల్గొన్నారు.

గెజిట్‌ను వెనక్కి తీసుకోవాలి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎస్‌ను అమలు చేస్తూ వెలువరించిన గెజిట్‌ను రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) కడప జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఉద్యోగ, ఉపాధ్యాయులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారని అందరూ వేచి చూస్తున్న తరుణంలో ఎలాంటి చర్చలు, సూచనలు లేకుండా ఇలాంటి గెజిట్ వెలువడటం ఆందోళన కలిగిస్తోందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరెడ్డి సంగమేశ్వరరెడ్డి అన్నారు.

రద్దు చేయాలి: ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకోకుండా చర్యలు తీసుకోవడం అన్యాయం అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నందలూరు: మహావిష్ణువు స్వరూపుడైన శ్రీ సౌమ్యనాథ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు అంకుకార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంకురార్పణకు నవధాన్యాలు, పూర్ణకుంభం ప్రతిష్ఠ, పుణ్యాహవచనాలకు బియ్యం, నెయ్యి, బెల్లం, టెంకాయలు, తమలపాకులు సమకూర్చారు. అర్చక స్వాములు సునీల్ కుమార్ బృందంతో కలశస్థాపన చేశారు. ఆగ్నేయ మూలలో వెలసి ఉన్న పుట్ట వద్ద పూజలు జరిపారు.పుట్టమన్ను సేకరించి అంకురార్పణ మంటపంలో ఏర్పాటు చేసిన 12 పాలికలలో ఉంచారు.అందులో నవధాన్యాలు చల్లి అంకురింపచేసే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవ వరులకు తిరుమంజనం కార్యక్రమాన్ని జరిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణం, తిరుమంజనం, రాత్రికి యాళివాహనంపై సౌమ్యనాథస్వామి గ్రామోత్సవ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, ఉమ్మడి కడప జిల్లా ఆలయ సూపరింటెండెంట్ హనుమంతు తెలిపారు.



అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అరచేతిలో ఆల్ ఇన్ వన్

- అన్నింటికీ 'మొబైల్' ప్రత్యామ్నాయం
- సకల సేవల సమాహారం
- మూలనపడిన పలు ఉపకరణాలు
- కాలచక్రమగమనంలో కనుమరుగు



సండే స్పెషల్

మదనపల్లె సిటీ: మణికట్టు మణిహారం చేతి గడియారం. మధుర జ్ఞాపకాలు కలకాలం గుర్తుండిపోయేలా చేసే కెమెరా... పాటలు వినిపించే టేప్‌రికార్డ్.. కాలాన్ని పదిలపర్చిన డైరీ..సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రుల క్షేమ సమాచారం మోసుకొచ్చే ఉత్తరం.. చిమ్మచీకటిలో దారి చూపే టార్చిలైట్.. తరతరాలుగా ఎన్నో ముచ్చట్లు మోసుకొచ్చిన రేడియో..ఎంతటి కఠినమైన లెక్కలనైనా పరిష్కరించే క్యాలిక్యులేటర్.. ఒకేటేమిటి ఇలా ఎన్నో ఉపకరణాలను కనుమరుగు చేస్తోంది. మొబైల్ ఫోన్, ఇవే కాదు వెండితెర, బుల్లి తెర,రైల్వే బ్యాంక్ కౌంటర్, ఏటీఎంలను ఇమడ్చుకుని మరిన్ని ఉపకరణాల కోసం ఎదురు చూస్తున్న అరచేతి ప్రపంచం మొబైల్ మాయజాలంపై 'ప్రత్యేక కథనం...

గడియారం టైమ్ బాగోలేదు..
ఒకప్పుడు చేతికి వాచీ ఉంటే అదో స్టేటస్ సింబల్,కానీ సెల్‌ఫోన్ రాకతో దీనికి ఆదరణ తగ్గింది. కొందరు మాత్రమే ఇప్పుడు చేతి గడియారాలు వాడుతున్నారు. సెల్‌ఫోన్‌లోనే సమయంతో పాటు తేదీ, నెల, సంవత్సరం, తిథి, వారం, నక్షత్రాలు వస్తుండటంతో పూర్తిగా పాత ఉపకరణాలను మర్చిపోయే పరిస్థితి నెలకొంది.

క్యాలిక్యులేటర్ కాలం చెల్లు
చిన్నపాటి లెక్కల కోసం మెదడుకు పని పెట్టకుండా కాగితం, పెన్ను ఉపయోగించకుండా అందుబాటులోకి వచ్చిన క్యాలిక్యులేటర్‌కు కాలం చెల్లింది. సెల్‌ఫోన్లలోనే ఈ ఆప్షన్ ఉండడంతో క్యాలిక్యులేటర్ వాడకుండా ఫోన్‌లోనే లెక్కలు చేస్తున్నారు.

డైరీలు వాడే వారేరి..?
రోజువారీ కార్యక్రమాలను నిక్షిప్తం చేయడమే కాకుండా ముఖ్యమైన విషయాలకు డైరీ ఎంతో అవసరం. మొబైల్ రిమైండర్‌లోనే నెలవారీ ప్రణాళికలు, సమాచారం రాసి పెట్టుకోవడానికి మెమోరి కార్డులు అందుబాటులోకి వచ్చాయి. కావాల్సినప్పుడు గుర్తు చేయడానికి రిమైండర్ ఆప్షన్ ఉండనే ఉంది. ఒకప్పుడు నిత్య జీవితంలో ముఖ్య భాగంగా ఉన్న ఆనాటి పాతతరం పరికరాలెన్నో ఉండేవి. ఇప్పుడు మొబైల్ ఫోన్ రాకతో తీపి జ్ఞాపకాలు మిగిలిపోతున్నాయి. ఇప్పుడు బ్యాంకింగ్ ,టికెటింగ్, అప్లాయింగ్ లాంటి ప్రక్రియలను తనలో ఇమడ్చుకొని సెల్‌ఫోన్ ఆన్ ఇన్ వన్‌గా మారిపోతుంది.

వెలగని టార్చిలైట్
చిమ్మచీకట్లో బయటకు వెళ్లడానికి, వస్తువులు వెతకడానికి గతంలో అందరి ఇంట్లో టార్చిలైట్ ఉండేది ఇప్పుడది ప్రత్యేకంగా కనిపించకుండా పోయింది. రాత్రిపూట పంట పొలాలకు వెళ్లేందుకు మాత్రమే రైతులు టార్చిలైట్ వాడుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి రెండు,మూడు మొబైల్ ఫోన్లు ఉన్నాయి. టార్చిలైట్లు కొనేవారు కరువయ్యారు.

▶▶ కెమెరాలకు తగ్గిన క్రేజ్


విహారయాత్రలు, వేడుకల సందర్భంగా కెమెరా సాయంతో ఫొటోలు, వీడియోలు తీసి తీపి గుర్తుగా భద్రపరచుకునేవారు. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లోనే కెమెరా ఇమిడిపోయింది. ఒక్క క్లిక్‌తో నచ్చిన దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో బంధించడమే కాకుండా వెంటనే అనేక మార్గాలు ద్వారా డిజిటల్ గ్రాఫిక్స్‌తో ఫొటోలు డిజైన్ చేసి అందంగా ముస్తాబు చేయడం వరకు సెల్‌ఫోన్‌లో ఉన్నాయి.ఫొటో తీసిన వెంటనే ఇతరులతో పంచుకోవడానికి కూడా అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం పెళ్లిళ్లు,శుభకార్యాలు, వేడుకలకు మెరుగైన నాణ్యత, కమర్షియల్ అవసరాల కోసం మాత్రమే డిజిటల్, వీడియో కెమెరాలు వాడుతున్నారు.

▶▶ ఉత్తరాలు కనుమరుగు

గతంలో సమాచారం చేరవేయడానికి ఉత్తరాలే ఆధారం. కాలక్రమంలో ల్యాండ్‌ఫోన్లు వచ్చినా అవి అందరికీ అందుబాటులో ఉండేవి కావు. పోస్టుకార్డులు, ఇన్‌లాండ్ లెటర్లు, ఎన్వలప్ కవర్లు... ఇలాల అనేక రూపాల్లో ఉత్తరాలు పంపించుకునేవారు. ఇప్పుడవన్నీ పాత జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత ఎస్ఎంఎస్, వాట్సాప్, ఇన్‌స్టాగమ్, స్కైప్, టెలీగ్రామ్, మెసెంజర్ అంటూ రక రకాల యాప్స్‌తో ఫోన్ నుంచి అన్ని రకాల సమాచారం క్షణంలో ప్రపంచం నలుమూలలకు వెళ్లిపోతున్నాయి. దీంతో ఉత్తరాలకు ఇప్పుడు ఆదరణ పూర్తిగా తగ్గింది.


మూగబోయిన టేప్ రికార్డర్
ఒకప్పుడు తెల్లవారిందంటే ఇళ్లు, వీధుల్లో టేప్ రికార్డర్ పాటలు వినిపించేవి. భక్తి సినిమా పాటలు, కథలతో హుషారెత్తించేది. అప్పట్లో ప్రతి ఇంటికి తప్పనిసరిగా టేప్ రికార్డు ఉండేది. వాటిని ఇప్పుడు అటకెక్కించారు. తొలుత టేప్ రికార్డును మింగేసింది. సీడీ ప్లేయర్, వాటని తోసేసి డీవీడీ ప్లేయర్, డిజిటల్ ప్లేయర్లు వచ్చాయి. వీటన్నింటిని మొబైల్‌ఫోన్లు పక్కకు నెట్టివేసింది. సెల్‌ఫోన్ ఉంటే చాలా పాతకాలం నాటి మధుర పాటల నుంచి మొదలు నేటి సినిమా పాటల వరకు అన్నీ నెట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని సెల్‌ఫోన్ ద్వారా వింటున్నారు. దీంతో అలనాటి టేప్ రికార్డర్, సీడీ, డీవీడీ ప్లేయర్ వరకు పరికరాలు అటకెక్కాయి.

ప్రతి ఇంట్లో రేడియో ఉండేది



టీవీలు వాడకం తక్కువగా ఉన్న సమయాల్లో ప్రతి ఇంట్లో రేడియో ఉండేది. వార్తలతో పాటు భక్తిగీతాలు, సినిమా పాటలు ఆసక్తిగా వినేవాళ్లం. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లోనే ఆడియో,వీడియో పాటలతో పాటు కోరుకున్న పాటలు, చిత్రాలు వీక్షించే అవకాశం ఉండటంతో రేడియో వాడకం పూర్తిగా తగ్గిపోయింది.
–టీఎస్‌ఏ. క్రిష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత,మదనపల్లె

డైరీల మాటే మరిచిపోయాం



నేను ఉద్యోగ రీత్యా పని చేసేటప్పుడు డైరీ తప్పకుండా వాడేవాడిని. క్రమం తప్పకుండా టూర్‌డైరీ రాసేవాడిని. ఏ రోజు ఎక్కడికి వెళ్లలన్నది డైరీలో రాయడంతో నాకు బాగా ఉపయోగపడేది. కాలక్రమంలో సెల్‌ఫోన్ వాడకంతో డైరీలు రాయడం మరిచిపోయాం. సెల్‌ఫోన్‌లోనే అని రాసుకుంటున్నాం. దీంతో డైరీల వాడకం తగ్గిపోయింది. -డాక్టర్ నాగేంద్ర, రిటైర్డు ప్రొఫెసర్, బీటీ కాలేజీ, మదనపల్లె

లెక్కలన్నీ సెల్‌ఫోన్‌లోనే..



మదనపల్లె సుమారు 30 ఏళ్లుగా బుక్‌స్టాల్ నడుపుతున్నా. గతంలో లెక్కలు క్యాలిక్యులేటర్‌తో చేసేవాడిని. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లోనే చేస్తున్నా. వినియోగదారుల ఖాతాలు సైతం ఖాతాబుక్ యాప్‌లో నమోదు చేసుకుంటున్నా. -ప్రసాద్‌రెడ్డి, దివ్యభారతి బుక్‌సెంటర్, మదనపల్లె

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి చర్యలు



లంకమల అభయారణ్యాన్ని సందర్శిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రామకృష్ణ

బద్వేలు అర్బన్: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పి.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం లంకమల అభయారణ్యంలోని బండిగానిసెల, పసువుల గుండం, మద్దిగుండం, చదునుబండ ప్రాంతాలతో పాటు రెడ్డిబావి బేస్‌క్యాంపును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడవుల్లో భాగమైన వృక్షజాతులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎర్రచందనం పరిరక్షణకు అటవీ ప్రాంత సమీపంలోని ప్రజల సహకారం తీసుకోవాలని సూచించారు. ఎర్రచందనం స్మగ్లర్లు ప్రవేశిస్తున్న మార్గాలను గుర్తించి బేస్‌క్యాంపులు పటిష్టం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎర్రచందనం స్మగ్లింగ్ ప్రభావిత గ్రామాల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని కోరారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేరానికి పదే పదే పాల్పడే వ్యక్తులపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం లంకమలలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, ప్లెయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్, కడప సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానంద, బద్వేలు ఎఫ్ఆర్ఓ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓలు రాజేష్‌రెడ్డి, సుదర్శన్, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతను ఛామన ఛాయ రంగు కలిగి ఉన్నాడు. బ్లూ పంచె, కాళ్లకు నల్లటి బెల్టు కలిగిన పాదరక్షలు ధరించాడు. కుడి ఛాతీపై కాలిన గాయం, ఒళ్లంతా ఆసుపత్రిలో కట్టు కట్టినట్లు ఉంది. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే ఎస్ఐను సంప్రదించాలని కదిరి రైల్వే ఎస్ఐ ఇబ్రహీం తెలిపారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం : పీటీఎం–ములకలచెరువు మండలాల సరిహద్దులోని సంద్రదవి అటవీ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 5న అక్రమంగా తరలిస్తున్న గంజాయి బస్తాలతో పాటు రెండు కార్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే తొమ్మిది మంది గంజాయి ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడు, బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం సమీపంలోని బండమీదపల్లికి చెందిన పిడుగు శ్రీనివాసులు (34)ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



ములకలచెరువు : మండల పరిధి నాయనచెరువుపల్లి సత్రం సమీపంలో శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ జింక తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ బీట్ అధికారి గోపాల్ జింకకు పశు వైద్యశాలలో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. అనంతరం మృతి చెందిన జింకను కనుగొండ అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు గోపాల్ తెలిపారు.

సెంట్రింగ్ పని చేస్తూ జారి పడి..

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని లోహియానగర్‌లో ఓ ఇంటిపై శనివారం సెంట్రింగ్ పనులు చేస్తూ జారి పడి చెర్లోపల్లి ప్రసాద్ (50) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల గ్రామానికి చెందిన చెర్లోపల్లి ప్రసాద్ సెంట్రింగ్ పనులను చేసుకుంటూ జీవనం సాగించేవాడు. లోహియానగర్‌లోని అస్లాంబాషు ఇంటిపైన సెంట్రింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్సకోసం అతన్ని రిమ్స్‌కు తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ తిమ్మయ్య తెలియజేశారు.

మునగ.. ఆదాయం దండిగ

- 100 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ ద్వారా సాగు
- ప్రతి మండలంలో ఒక నర్సరీ ఏర్పాటు
- అర్హులైన రైతులు ముందుకు రావాలంటున్న అధికారులు


ఉపాధి హామీ కింద సాగు చేసిన మునగ పంట


విక్రయానికి సిద్ధం చేసిన మునగకాయలు

కడప సిటీ : మునగ సాగు ప్రోత్సాహం కోసం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో 100 శాతం సబ్సిడీ కల్పిస్తోంది. మండలానికి ఒక నర్సరీ చొప్పున ఒక్కొక్క నర్సరీలో ఐదు వేల మొక్కలు పెంచడానికి వీలుంటుంది. ఇందుకోసం అర్హులైన రైతుల గుర్తింపులో ఉపాధి సిబ్బంది నిమగ్నమయ్యారు. పీకేఎం–1 అనే మునగ రకాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ రకం మొక్కలు ఆరు నెలల్లో పూత, ఎనిమిది నెలల్లో కోతకు వస్తాయి. మొక్కలు 200 కాయలకుపైగా దిగుబడి కూడా ఇస్తుంది. కాయ పొడవు 70 సెం.మీ.తోపాటు 150 గ్రాముల బరువును కూడా కలిగి ఉంటుంది. అందువల్ల మార్కెట్‌లో ఈ రకానికి మంచి గిరాకీ ఉంటుంది. అంతేకాకుండా మునగలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ప్రధానంగా గర్భిణీల్లో రక్తహీనతను నిరోధించేందుకు ప్రధానపాత్ర పోషిస్తుంది.

తక్కువ నీటితోనే అధిక దిగుబడి

మునగ సాగుకు నీళ్లు అంతగా అవసరం ఉండదు. ఈ మొక్కలను రైతులు నర్సరీలోనే పెంచి సాగు చేసుకుని సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఇందుకు నర్సరీలో మొక్కలు పెంచినందుకు ప్రభుత్వం నిర్వహణ చార్జీలను కూడా చెల్లించడం జరుగుతుంది. సాగు చేసుకునే రైతు సొంతంగా మొక్కలు కొని సాగు చేసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది. అలా కొన్న వాటికి రైతులకు ప్రభుత్వం మొక్కల ఖరీదుతోపాటు రెండేళ్ల పాటు నిర్వహణ చార్జీలను కూడా చెల్లిస్తుంది.

గరిష్టంగా ఎకరా వరకు సాగు

మునగ సాగుకు ఉపాధి హామీలో కనిష్టంగా 0.25 ఎకరాల నుంచి ఒక ఎకరా వరకు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఒక ఎకరాకు ప్రభుత్వం ద్వారా 1.05 లక్షలు వివిధ దశల వారీగా చెల్లిస్తారు. గత రెండేళ్ల నుంచి మునగ సాగు ఉపాధి హామీలో ఉన్నప్పటికీ ఈ ఏడాది ఎక్కువ సంఖ్యలో సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

సాగు ఇలా..

ప్రభుత్వ ఖాళీ భూముల్లో గానీ, సొంత భూమిలో గానీ, స్వయం సహాయక సంఘాల మహిళలు మునగాకు నర్సరీలను పెంచవచ్చు. ప్రతి ఐదు వేల మొక్కలను పెంచేందుకు మూడు మాసాలకు రూ.31,111లను ప్రభుత్వం సాయం అందిస్తుంది. పెంచిన మొక్కలను ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉచితంగా అందజేస్తారు. ప్రభుత్వ భూమిలో ఎకరాకు 448 మొక్కలు పెంచుకుని వాటి నుంచి ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇందుకుగాను రెండేళ్ల కాలానికి ప్రభుత్వం రూ.86,614 ఇస్తుంది.

మునగాకులో ఎన్నో ఔషధ గుణాలు

మునగాకుతో 300 వ్యాధులు దూరమవుతాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. మునగకాయలు మనం నిత్యం తినే ఆహారమేనని మనకు తెలిసినప్పటికీ, అయితే మునగకాయల్లో ఇన్ని ఔషధ గుణాలు ఉన్నాయని తెలిసి ఉండకపోవచ్చు. మునగాకులో ఏ, సీ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఆయుర్వేదంలో 300 వ్యాధులు నయం చేసేందుకు మునగాకును ఉపయోగిస్తారు. క్యారెట్ తింటే వచ్చే విటమిన్స్ కంటే 8–10 రెట్లు అధికంగా మునగాకు ద్వారా పొందే అవకాశం ఉంటుంది. కంటి వ్యాధులకు సంబంధించిన మందుల్లో కూడా వాడతారు. మహిళలు రోజుకు ఏడు గ్రాముల మునగాకు పొడిని మూడు నెలలపాటు రెగ్యులర్‌గా తీసుకుంటే 13.5 శాతం బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయని పరిశోధనల్లో తేలింది. థైరాయిడ్‌కు మంచి మెడిసిన్‌గా పని చేస్తుంది. మునగాకు రసం పిల్లలకు అందిస్తే ఎముకలు బలంగా తయారవుతాయి. పాలిచ్చే తల్లులకు పాలు పెరిగేందుకు ఉపయోగపడుతుంది. 100 గ్రాముల మునగాకులో ఉండే పోషక పదార్థాలు నీరు 75.9 శాతం, పిండి పదార్థాలు 13.4 గ్రాములు, కొవ్వు పదార్థాలు 17 గ్రాములు, మాంసకృతులు 6.7 గ్రాములు, క్యాల్షియం 440 మిల్లీగ్రాములు, ఐరన్ 7 మిల్లీ గ్రాములు, సి–విటమిన్ 200 మిల్లీ గ్రాములు, ఖనిజ లవణాలు 2.3 శాతం, పీచు పదార్థం 0.9 మిల్లీ గ్రాములు, ఎనర్జీ 97 క్యాలరీలు ఉంటుంది.

ఎంతో లాభదాయకం



నా పేరు రామ సుధాకర్‌రెడ్డి. మాది వేంపల్లె మండలం అలిరెడ్డిపల్లె గ్రామం. నేను 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా రెండు ఎకరాల్లో 896 మునగ మొక్కలు నాటాను. ఇందుకుగాను ఉపాధి హామి తరపున రెండేళ్లకు గాను రూ.2 లక్షలు మంజూరు చేయడం జరిగింది. దాదాపుగా ఇప్పటికే రూ.70 వేల వరకు చెల్లింపు జరిగింది. ఈ పంట వేయకమునుపు వరి వేసేవారం. ఖర్చులకే సరిపోయేది. కష్టం వృథాగా పోయేది. పీకేఎం–1 అనే ఈ వెరైటీ మునగ మొక్కలు నాటాను. ఇప్పటి వరకు 100 కిలోల కాయలు కోత కోయడం జరిగింది. కిలో రూ.16 చొప్పున విక్రయించాము. వరితో పోలిస్తే ఈ పంట సాగు ఖర్చు తక్కువ. నీటి అవసరం తక్కువ. చాలా లాభదాయకంగా ఉంది. ఈ రకం మునగకాయలకు మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉంది.

ఎట్టకేలకు స్పందించారు

ప్రొద్దుటూరులోని పుట్టపర్తి సర్కిల్‌లో వంద అడుగుల ఎత్తులో ఉన్న జాతీయ పతాకాన్ని అధికారులు ఎట్టకేలకు మార్చారు. జాతీయ పతాకం వారం రోజుల క్రితం చిరిగినా అధికారులు కానీ, పాలకులు కానీ స్పందించడంలో జాప్యం చేశారు. పట్టణ ప్రజలు చిరిగిన జాతీయ పతాకాన్ని చేసి ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్ల క్రితం వంద అడుగుల ఎత్తులో జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఎప్పుడు పతాకం చిరిగిపోయిన మరుసటి రోజు మార్చిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం చిరిగిన జాతీయ పతాకాన్ని మార్చేందుకు వారం రోజులు సమయం తీసుకోవడం గమనార్హం. – ప్రొద్దుటూరు



కొనసాగుతున్న సౌత్ ఇండియా హాకీ పోటీలు


హాకీ పోటీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్, కేరళ బాలికల జట్లు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో జరుగుతున్న సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్ హాకీ క్రీడా పోటీలలో సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్‌లో భాగంగా కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించిన జూనియర్స్ బాలబాలికల జట్ల పోటీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం జూనియర్స్ మహిళా విభాగంలో కేరళ–పాండిచ్చేరి జట్లు తలపడగా 10 గోల్స్‌తో కేరళ జట్టు విజయం సాధించింది. తమిళనాడు జట్టు తెలంగాణా జట్టుపై 9 గోల్స్ వేసి జయకేతనం ఎగురవేసింది. ఆంధ్రప్రదేశ్ జట్టు కేరళ జట్టుపై 11 గోల్స్ వేసి విజయం సాధించింది. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో తెలంగాణా జట్టు కర్ణాటక జట్టుపై 2 గోల్స్ వేసి జయకేతనం ఎగురవేసింది. తమిళనాడు జట్టు కేరళ జట్టుపై 6 గోల్స్ వేసి విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ జట్టు పాండిచ్చేరి జట్టుపై 5 గోల్స్ వేసి విజయం సాధించిందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చాణిక్య రాజ్ తెలిపారు.

ఒంటిపై వేడి నూనె పోయడంతో కేసు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సభ్యతవారిపల్లి గ్రామంలో శనివారం కదిరి ప్రభాకర్ (55) అనే వ్యక్తి ఒంటిపై అదే గ్రామానికి చెందిన గజ్జల చిన్నప్పగారి వెంకటసుబ్బారెడ్డి వేడి నూనె పోయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తప్పెటవారిపల్లిలోని వెంకటసుబ్బారెడ్డి కిరాణాషాపు వద్దకు కదిరి ప్రభాకర్ రాగా అతనిని అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ వెంకటసుబ్బారెడ్డి కోరారు. అందుకు కదిరి ప్రభాకర్ నిరాకరించడంతో అతనిని కులంపేరుతో దూషించి, కర్రతో దాడి చేసి, సలసల కాగే నూనెను ఒంటిపై పోశాడు. నూనె పోయడంతో ప్రభాకర్ శరీరం సగం కాలిపోయింది. దీంతో అక్కడే ఉన్న ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటసుబ్బారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ముగిసిన ఐసీఎస్ఈ కబడ్డీ టోర్నమెంట్


అండర్–17 చాంపియన్స్ పటాన్‌చెరువు శ్రీసాయిపబ్లిక్ స్కూల్


అండర్–14 చాంపియన్స్ తూప్రాన్ అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్

- అండర్–19 చాంపియన్స్‌గా గుంటూరు లయోల
- అండర్–17 విజేతగా హైదరాబాద్ సాయిపబ్లిక్ స్కూల్
- అండర్–14 విజేతగా తూప్రాన్ అభ్యాస్ స్కూల్

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా గత మూడు రోజుల పాటు నిర్వహించిన ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఐసీఎస్ఈ) రీజినల్ కబడ్డీ టోర్నమెంట్ శనివారం ముగిసింది. కబడ్డీ అండర్–19 విభాగం విజేతలుగా గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్ నిలువగా, రెండో స్థానంలో హబ్సీగూడ సెయింట్ జోసఫ్ స్కూల్, మూడో స్థానంలో తూప్రాన్ అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్, 4వ స్థానంలో పటాన్‌చెరువు శ్రీసాయి పబ్లిక్‌స్కూల్ జట్లు నిలిచాయి. అండర్–17 విభాగంలో పటాన్‌చెరువుకు చెందిన శ్రీసాయిపబ్లిక్ స్కూల్ విజేతగా నిలువగా, రెండో స్థానంలో హైదరాబాద్ కుంట్లూరు జాన్సన్ గ్రామర్‌స్కూల్ నిలిచింది. మూడో స్థానంలో తూప్రాన్ అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్, 4వ స్థానంలో హైదరాబాద్ మల్లాపూర్ జాన్సన్ గ్రామర్ స్కూల్ జట్లు నిలిచాయి. అండర్–14 విభాగంలో తూప్రాన్ అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో పటాన్‌చెరువు శ్రీసాయి పబ్లిక్‌స్కూల్, 3వ స్థానంలో కడప హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ జట్టు, 4వ స్థానంలో కుంట్లూరు జాన్సన్ గ్రామర్ స్కూల్ నిలిచాయి. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్నల్ ఎ.శేఖర్ విచ్చేసి విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మూడురోజుల పాటు చక్కటి ఆటతీరును ప్రదర్శించారన్నారు. టోర్నమెంట్ విజయవంతం చేసిన ఫిజికల్ డైరెక్టర్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు.శ్రీనివాసమూర్తి, హెచ్ఎం రహమతుల్లా, ఫిజికల్ డైరెక్టర్లు కల్యాణ్, తిరుమలశెట్టి ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జగన్‌పై అక్రమ కేసు

రాజకీయ విలువలకు తిలోదకాలు

- అవాస్తవం అని తేలినా మూడేళ్ల తర్వాత జగన్‌పై కేసా..!
- రఘురామకు దెబ్బలు లేవని నివేదిక తేల్చినా కేసు పెట్టడమేంటి
- కక్ష సాధింపు కోసమే అక్రమ కేసు
- వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : టీడీపీ శాసన సభ్యులు కనుమూరి రఘురామ క్రిష్ణంరాజుపై పోలీసుల దాడి వాస్తవం కాదని వైద్య పరీక్షల నివేదిక నిగ్గు తేల్చినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించడం రాజకీయ విలువలకు తిలోదకాలు ఇవ్వడమేనని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఖాజీపేట మండలం దుంపలగట్టులోని తన కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తోసిపుచ్చినా మూడేళ్ల అనంతరం ఈ కేసులో ఎలాంటి సంబంధం లేని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎటువంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా అక్రమ కేసు పెట్టడం సరికాదన్నారు. ఇది పూర్తిగా విష సంస్కృతికి బీజాలు వేయడమేనని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌పై పెట్టిన కేసు ఏమి కాదని, ఎలాంటి సాక్ష్యాలు లేవని, ఈ కేసు కోర్టులో నిలవదని తెలిసినా కక్ష సాధింపులో భాగంగానే అక్రమంగా నమోదు చేశారన్నారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల్ని ఈ కేసు విస్మయ పరుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌తో పాటు మరి కొందరు పోలీస్ అధికారులు, ఉన్నత అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని విరుచుకుపడ్డారు. రఘురామక్రిష్ణంరాజును గుంటూరు కోర్టులో హాజరు పరిచినప్పుడు ఆయన మాటలకు, ప్రస్తుతం ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు పొంతన లేదన్నారు. అలాంటప్పుడు పోలీసులు కేసు ఎలా నమోదు చేస్తారని సూటిగా ప్రశ్నించారు. ఇలాంటి అక్రమ కేసుల వల్ల భవిష్యత్ రాజకీయాల్లో వారికే ఇబ్బందిగా మారుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల నేతలు తప్పెట రామక్రిష్ణారెడ్డి, మల్లె ఓబయ్య యాదవ్, రెడ్యం నాగేశ్వర్ రెడ్డి, ఇండ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే జగన్‌పై కేసు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబు ప్రభుత్వం కేసు పెట్టించిందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అడ్డం పెట్టుకుని పక్కా పన్నాగంతో తప్పుడు కేసు నమోదు చేశారని అన్నారు. 2021లో జరిగిన ఘటనపై ఇప్పుడు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యే అని అన్నారు. కక్ష సాధింపు చర్యలు ఆపకపోతే రాబోయే రోజుల్లో కూటమి నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం వంటి చర్యలతోపాటు ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం తప్ప ప్రజలకు మేలు చేయలేదన్నారు. వైఎస్ విగ్రహాలను విధ్వంసం చేసినంత మాత్రాన పేద ప్రజల గుండెల్లో నుంచి ఆయనపై ఉన్న అభిమానాన్ని తుడిపేయలేరన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు సంబంధించి ఆస్తులు ధ్వంసం చేయడంతోపాటు భయభ్రాంతులకు గురిచేసి గ్రామాలను వదిలి వెళ్లే విధంగా కూటమి నాయకులు ప్రవర్తించడం హేయమైన చర్య అని అన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్‌సిక్స్ హామీల వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. అందులోని తల్లికి వందనం హామీని పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు అవుతున్నా అమలు చేయకపోవడంపై తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమైన వెంటనే అమ్మఒడి తల్లుల ఖాతాల్లో జమ అయ్యేదని గుర్తుచేశారు. అలాగే ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా దాడులు, విధ్వంసాలు, అక్రమ కేసులు పెట్టడం మానుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

– ద్విచక్ర వాహనం దగ్ధం, వ్యక్తికి గాయాలు


కాలిపోయిన బైక్

తొండూరు : పులివెందుల – ముద్దనూరు ప్రధాన రహదారిలోని ఇనగలూరు రాజసేతుసాగర్ సమీపంలో ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొన్న సంఘటనలో బైకు దగ్ధమైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం ప్రొద్దుటూరు నుంచి పులివెందులకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా.. మండలంలోని టి.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన బండి బాబుల్‌రెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ రెండు వాహనాలు ఇనగలూరు రాజశేతుసాగర్ సమీపంలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బాబుల్‌రెడ్డి దూరంగా పడిపోయాడు. బైకులో నుంచి మంటలు చెలరేగాయి. ఈ వాహనం పూర్తిగా దగ్ధమైంది. బాబుల్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు.

రిమ్స్ మార్చురీలో రెండు గుర్తు తెలియని మృతదేహాలు




కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతూ ఇరువురు వ్యక్తులు వేర్వేరు సమయాలలో శనివారం మృతి చెందారు. రెండు మృతదేహాలను రిమ్స్ మార్చురీలో వుంచారు. వీరి ఆచూకీ తెలిసిన వారు గానీ, బంధువులు గానీ తమను తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు తెలియజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మండలంలోని కురవంక పంచాయతీ సరస్వతీనగర్‌లో నివాసం ఉన్న మహమ్మద్ అలీ భార్య అమీనా(28) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.